క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశ్వరి

రామడుగు: మండల కేంద్రంలో పారిశుధ్య పనులను శుక్రవారం ఎంపీడీవో రాజేశ్వరీ పరిశీలించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు నిత్యం నిర్వహించాలని రహదారుల వెంట చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మురుగునీటి కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

రికార్డులను పరిశీలించిన క్వాలిటీ కంట్రోలర్



రికార్డులు పరిశీలిస్తున్న హారిక, విజయ్‌కుమార్

శంకరపట్నం: తాగునీటి సరఫరాకు సంబంధించి ఏడు రికార్డులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ హారిక, ఏఈ విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. తాడికల్, వంకాయగూడెం, మొలంగూర్, పంచాయతీలలో నీటి సరఫరా, క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, కొత్త కనెక్షన్లు, లీకేజీ పైపులు, బ్లీచింగ్ పౌడర్ తదితర రికార్డులను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మొగిలి, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ ఆడుతున్న సీఐ రాజ్‌కుమార్

మానకొండూర్: యువత క్రీడల్లో రాణించాలని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 17వ మెమోరియల్ క్రికెట్ లీగ్‌ను అంబేడ్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. పట్టుదలతో ఆడితే విజయం సాధ్యమని, విజయాలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, ఉప సర్పంచ్ మూగల మహేందర్‌రెడ్డి, శంకరయ్య, బాబుమియా, బొద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆరెల్లి ఆంజనేయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న సృజన్‌కుమార్

రామడుగు: ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. నాలుగు నెలల నుంచి కూలీ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్ లింక్ ఉన్న కూలీలకు డబ్బులు పడినట్లు మెసేజ్ వస్తున్నా ఖాతాలో నగదు జమ కావడం లేదని తెలిపారు. ఉపాధి కూలీలకు రోజువారీ కూలీల మాదిరిగా రూ.ఆరువందల చొప్పున, రెండు వందల రోజులు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంటె రాజేశం, ఎగుర్ల మల్లేష్, కనకయ్య, ఐలయ్య, రాజవ్వ,విజయలక్ష్మీ, లలిత, జ్యోతి, మాధవిలతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోస్ట్‌మాస్టర్ మహేందర్

హుజూరాబాద్: గ్రామీణ తపాలా జీవిత బీమా 29వ వార్షికోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని సబ్‌జైల్‌లో శుక్రవారం పోస్టల్‌శాఖ పథకాలపై జైల్‌శాఖ సిబ్బంది, ఖైదీలకు పెద్దపల్లి సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోస్ట్‌మాస్టర్ మహేందర్ మాట్లాడుతూ... అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధులు పోస్టల్ పథకాలు వినియోగించుకోవడానికి అర్హులని తెలిపారు. యాక్సిడెంటల్ బీమా పథకానికి 18 నుంచి 65 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు ఏడాదికి రూ.520 లేదా రూ.755 చెల్లిస్తే రూ.10 లక్షలు నుంచి రూ.15 లక్షలు ప్రమాద బీమాకు అర్హులని తెలిపారు. సబ్‌జైలు సూపరింటెంట్ గణేశ్, సీపీసీ సూపర్‌వైజర్ అమర్‌నాథ్‌రెడ్డి, పోస్ట్‌మాన్ సంపత్, హరీశ్, రాజేశ్, శివాజీ, సత్యం, స్వామి తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీఅయ్యప్పస్వామి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు



నృత్యం చేస్తున్న చిన్నారులు

జమ్మికుంట: పట్టణంలో శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని మహా కుంబాభిషేకాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మూడురోజుల పాటు నిర్వహించే మహా కుంబాభిషేక మహోత్సవంలో భాగంగా శ్రీ విశ్వేశ్వరస్వామి (బొమ్మలగుడి) దేవాలయం నుంచి పురవీధుల గుండా శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం వరకు వైభవంగా రథోత్సవం నిర్వహించారు. అయ్యప్పస్వామిని రథోత్సవంపై ప్రతిష్ఠించగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు జెండా యాత్రను ప్రారంభించారు. వేదపండితులు వెంకటేశ్‌శర్మ ఆధ్వర్యంలో బోనాలు, మహిళల కోలాటం, చిన్నారుల నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. స్వామివారికి భక్తులు మంగళ హారతులతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిమల్లె జయేందర్, గురుస్వాములు మనోహర్‌స్వామి, రాజేంద్రప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, జగదీశ్వర్, వీర్రాజు, దామోదర్, భక్తులు పాల్గొన్నారు.

వెలిచాలలో కుంకుమపూజ



పూజా వేదిక వద్దకు ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న వేదపండితులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదపండితులు కుంకుమపూజ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయంలో శ్రీలక్ష్మీ హవనం, నిత్య హోమం, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్ఠి, నందనవనంలో కల్యాణమూర్తులకు వసంతోత్సవం తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ సరోజన, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కుంకుమ పూజలో మహిళలు

పౌష్టికాహారం తీసుకోవాలి



పాలంపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సుందరగిరిలో......

తిమ్మాపూర్: మండలంలోని పొలంపల్లిలో శుక్రవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సమతుల ఆహారం పోషణ్ బీ, పడాయి బీ అనే అంశంలో భాగంగా సమతుల ఆహారం, చిరుధాన్యాలు, పూర్వ ప్రాథమిక విద్య అంశాలను వివరించారు. అనంతరం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. నీటి ప్రాధాన్యత, భవిష్యత్ తరాలకు వాటిని అందించడానికి మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నీటిని వృథా చేస్తే భవిష్యత్‌లో జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. వాననీరు భూమిలో ఇంకేలా ఇంకుడుగుంతలు తవ్వుకోవాలని సూచించారు. కార్య క్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ముఖ్య అతిథులుగా హెచ్‌ఎం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎం తిరుమల, వీవోలు అంగన్‌వాడీ టీచర్లు ఆశావర్కర్లు, టీచర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి లో....

చిగురుమామిడి మండలం సుందరగిరి, సీతారాంపూర్ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజశ్రీ, ఇందిరా, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లుపాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పుట్టినిళ్లు

మానకొండూర్‌రూరల్: గర్భిణులు, బాలింతలు, పుట్టిన పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్లు పుట్టినిళ్లు వంటివని సీడీపీఓ సబిత అన్నారు. మండలంలోని వెల్ది అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ హాజరై మాట్లాడారు. పిల్లలకు పోషకాహారం విలువ, ఆరోగ్యం గూర్చి వివరించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఏసీడీపీఓ అరవింద, హెచ్‌ఎం చంద్రమౌళి, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మీ, టీచర్లు పద్మ, కె.అరుణ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని పోచమ్మవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా హుజూరాబాద్ ఇన్‌చార్జి సీడీపీవో తిరుమల మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, బెల్లం, కాయగూరలు పండ్లు తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.



వెల్దిలో మాట్లాడుతున్న సీడీపీఓ సబిత



హుజూరాబాద్: గర్భిణులకు సీమంతం

కంప్యూటర్లు వితరణ



కంప్యూటర్లు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

వీణవంక: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూజివీడు కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరు కంప్యూటర్లు బహూకరించారు. ఈసందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు కంప్యూటర్ విద్య అవసరమని, అందుకే కంప్యూటర్లు వితరణ చేశామన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా నూజివీడు ఆధ్వర్యంలో 26 కంప్యూటర్లు అందించామని, రాబోయే రోజుల్లో మరింత సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్‌ను హెచ్‌ఎం దూడం రాజమల్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు గూడ శ్రీనివాస్‌రావు, సంజయ్ కులకర్ణి, జగదీశ్, దూడ పాక రవి, ఆర్గనైజర్ చొప్పరి తిరుపతి, నాయకులు మాసాడి మాదవరావు, మాజీ సర్పంచ్ సంపత్ రావు, చొప్పరి సారయ్య తదితరులు ఉన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

హుజూరాబాద్: హుజూరాబాద్ న్యాయవాదుల సంఘం ఎన్నికలు 28వ తేదీన నిర్వహించనున్నామని ఎన్నికల అధికారులు కె.భగవాన్ రెడ్డి, సీకే జేమ్స్, ఎన్.సత్యనారాయణలు శుక్రవారం తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత అధ్యక్ష పదవికి గోస్కుల శ్రీనివాస్, యతిపతి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్ష పదవికి బోనగిరి కుమారస్వామి, బండి రమేశ్, ప్రధాన కార్యదర్శి పదవికి ఎర్రోళ్ల రమేశ్, మట్టెల తిరుపతి, కోశాధికారి పదవికి సిహెచ్ భాను కిరణ్, ఎం దివ్య, లైబ్రేరియన్ పదవికి బత్తుల తిరుపతి, అప్పని రాజు, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్‌గా అందె వెంకటేశ్వరరావు, పి.లింగారెడ్డి పోటీలో ఉన్నారని, సహాయ కార్యదర్శిగా పి.జ్యోత్స్నదేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా కె.సరిత, మహిళా సభ్యురాలుగా ముశం మౌనిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఏఎస్సై అంత్యక్రియల్లో అడిషనల్ డీసీపీ



తిమ్మాపూర్: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మార్కొండ కిషన్ బుధవారం గుండెపోటుతో మృతిచెందగా అంత్యక్రియలు స్వగ్రామం మండలంలోని మన్నెంపల్లిలో శుక్రవారం నిర్వహించారు. అంత్యక్రియల్లో అడిషనల్ డీసీపీ(ఏఆర్) అనోక్ జైన్ పాల్గొన్నారు. అంతకుముందు కిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(వెల్ఫేర్) శ్రీధర్ రెడ్డి, ఇతరులు హాజరయ్యారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ఇంటి, ట్రేడ్ లైసెన్స్, నల్లా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ అయాజ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్‌లో అధికారులతో పన్నుల వసూళ్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు 84శాతం వసూలు చేయగా 31వ తేదీ వరకు వందశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించే 90శాతం రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఆర్ ఐ భాస్కర్, హెల్త్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్లు, బిల్లు కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న సిద్దాంత్ లోహియా

మానకొండూర్: రైతుల బంగారు భవిష్యత్‌కు ఆయిల్‌పామ్ సాగు ఎంతో ఉపయోగపడుతుందని ఇండోనేషియా అగ్రగామి శాస్త్రవేత్త విజయన్, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ సీఈవో సిద్ధాంత్ లోహియా అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో ఓ రైతు ఆయిల్‌పామ్ క్షేత్ర సందర్శన, రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో వాతావరణ పరిస్థితులకు అనువుగా ఉన్న డెలిలామే రకం వృద్ధి చేశామని, వీటిని లోహియా కంపెనీ దిగుమతి చేసుకుని రైతులకు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయని, మూడు నెలలకోసారి సిరాడ్ పామ్ ఎలిట్ బృందం ఇక్కడికి వచ్చి తోటలను పరిశీలిస్తారన్నారు. రైతులు పండించే ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. సాగునీటి యజమాన్య, మల్చింగ్ పద్ధతి, పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గూర్చి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, కంపెనీ సాంకేతిక సలహాదారు డాక్టర్ వైఎస్ రంగనాయకులు, ఎఫ్‌పీవో చైర్మన్ పాకాల పురుషోత్తంరెడ్డి, కేవీకే శాస్త్రవేత్త వేణుగోపాల్, లోహియా రీజినల్ మేనేజర్ కె. విజయ్‌భరత్, ఏఈవో శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, పప్పు సమ్మయ్య, కిరణ్మయి, వికాస్, ఓరుగంటి రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, వేణు, సూర్యక్రాంతి, వంశీ, శ్రావణ్, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై ..

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామం రైతువేదికలో వరి, మొక్కజొన్న పంటల్లో యాజమాన్య పద్ధతులపై జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.చత్రునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వరిలో అగ్గితెగులు, మెడవిరుపు తెగుళ్ల నివారణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను గూర్చి వివరించారు. వ్యవసాయం అధికారులు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.రజిత, వ్యవసాయ విస్తరణ అధికారి మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి

శంకరపట్నం: సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధి చేస్తున్నామని మెట్‌పల్లి సహకార సంఘం చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో శుక్రవారం మెట్‌పల్లి సహకార సంఘం మహాసభ సమావేశం నిర్వహించారు. సీఈఓ సదయ్య సంఘం ఆర్థిక లావాదేవీలు చదివి వినిపించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంఘంలోని సభ్యులకు ధాన్యం విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. నూతన గృహాలు నిర్మించుకునేవారికి సిమెంట్‌ను కూడా అందుబాటులో ఉంటుందని, జాతీయ రహదారి పనుల్లో గోదాం తొలిగిపోతుండటంతో నూతన గోదాం కోసం 20 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసి నూతన గోదాం నిర్మించామన్నారు. ఆముదాలపల్లి గోదాం నిర్మాణంతో పాటు దుకాణాల సముదాయాన్ని, డీజిల్ పంపు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్, రవీందర్, పాపారెడ్డి, సాయిలు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి పీఏసీఎస్ వార్షిక సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ మల్లారెడ్డి

చొప్పదండి: గత ఆర్థిక సంవత్సరంలో చొప్పదండి సహకార సంఘం రూ.1.57 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు జాతీయ ఉత్తమ పీఏసీఎస్ అవార్డు గ్రహీత వెల్మ మల్లారెడ్డి వెల్లడించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం సంఘం ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... సంఘం పరిధిలోని రైతుల నిబద్ధతతో ఇప్పటికే మూడుసార్లు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డును అందుకున్నానని, లాభాల నుంచి సభ్యులకు పదిశాతం డివిడెంట్ అందించడానికి తీర్మానించామని తెలిపారు. రైతులు సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న దుకాణాల్లో ఎరువులు, మందులు, పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం సంఘం పరిధిలోని పదమూడు మంది నిరుపేద విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు ముద్దం మహేశ్, సీఈవో క్లోం తిరుపతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు గుంటి మల్లయ్య, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ డీసీవో గుర్రం ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, డైరెక్టర్లు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

గన్నేరువరం: మండలంలోని గుంటుక శ్రీనివాస్‌కు వైద్య చికిత్సల కోసం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శ్రీనివాస్ కుటుంబసభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎల్‌వోసీ మంజూరు చేశారని అన్నారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని మల్కాజిగిరిలో వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘం నాయకులు డిమాండ్ శుక్రవారం చేశారు. ఐలమ్మ వీరత్వానికి ప్రతీక, రజాకారుల అరాచకాలపై పోరాటం చేసిందన్నారు. ప్రభుత్వం దుండగులను గుర్తించి శిక్షించాలన్నారు. సమావేశంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి సారయ్య, అధికార ప్రతినిధి జంపయ్య, మండల అధ్యక్షుడు మొగిలిసాయి, నాయకులు శంకర్, రామారావు, సదానందం, కొమురయ్య, రవి పాల్గొన్నారు.

జీరో ఖాతాలకు స్పందన



వివరాల నమోదులో బ్యాంకు అధికారులు

జమ్మికుంట: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జీరో ఖాతాల మెగా క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. బ్యాంక్ మేనేజర్ దొరస్వామి నాయక్ మాట్లాడుతూ.. జీరో బాలెన్స్ ఖాతాలు 110 మందికి అందించామని, అందులో 70 మందిని ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, 15మందిని పీఎం జీవనజ్యోతి భీమాయోజన, 20 మందిని అటల్ పెన్షన్ యోజన కింద నమోదు చేశామన్నారు. రెండు రోజుల పాటు క్యాంపు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రీజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నితీశ్, కరీంనగర్ ఏరియా గ్రామ తరంగ్ మేనేజర్ కిరణ్, బ్యాంక్ మిత్రలు సమ్మెట అచ్యుత్, ఈర్ల రమేశ్, పర్లపల్లి మమత, అరెల్లి స్వరూప, ఈర్ల దివ్య, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈపై ఫిర్యాదు

శంకరపట్నం: చెట్టుకొమ్మలు అనుమతి లేకుండా నరికివేశారని ఆముదాలపల్లి సబ్‌స్టేషన్ ఏఈ కుమారస్వామిపై జీపీ కార్యదర్శి కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల డీపీఓ రవీందర్ వీణవంక వెళ్తుండగా ఆముదాలపల్లిలో చెట్టుకొమ్మలు నరికివేస్తున్నాడని గమనించి వెంటనే సంబంధితశాఖపై చర్యలు చేపట్టాలని సెక్రటరీని ఆదేశించారు. డీపీఓ ఆదేశాల మేరకు ఏఈపై శుక్రవారం గ్రామకార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కబ్జా అవాస్తవం

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 387/6లోని భూమి కబ్జాకుగురికాలేదని, శనిగరపు భాస్కర్, శనిగరపు కిరణ్‌కు భూమితో ఎలాంటి సంబంధంలేదని పోడేటి రామస్వామి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ... రైతులు పొలాల వద్దకు వెళ్లే దారిని జేసీబీతో భాస్కర్, కిరణ్ అక్రమంగా చదును చేస్తుండగా వద్దు అన్నందుకు బెదిరింపులకు గురి చేస్తున్నారనడం అవాస్తవమన్నారు. వాళ్ల పెద్దమ్మకు పట్టా భూమి ఉంది కానీ వారికి భూమి లేదన్నారు. కావాలనే దురుద్దేశంతో ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నాడు.

మద్యం పట్టివేత

జమ్మికుంట : మున్సిపల్ పరిధిలోని కేశవపూర్ గ్రామంలో పోలీసులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఓ వ్యక్తి నుంచి రూ.2000 విలువ చేసే మద్యం పట్టుకొని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జమ్మికుంట: ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని తనుగుల గ్రామశివారులో శుక్రవారం శంబునిపల్లి, గుంపుల, తనుగుల గ్రామాలకు చెందినవారు శుక్రవారం పేకాట ఆడుతుండగా పట్టుకొని వారినుంచి రూ.3,100 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి



హుజూరాబాద్‌రూరల్: లక్ష్య సాధనకు నిరంతరం శ్రమిస్తే భవిష్యత్ అద్భుతంగా ఉంటుందని కమల ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు అన్నారు. వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వీబీఆర్ సాంస్కృతిక వారోత్సవాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీతత్వానికి అనుగుణంగా విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకొని ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కళాశాలలో సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీవీ హనుమకుమర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.